# [illegible] నాగేశ్వరరావు ఆధునిక నీతికథలు

శివసుబ్రహ్మణ్యం పద్నాలుగేళ్ళ క్రితం డి.ఇ.వో. ఆఫీసులో ఎల్డీసీగా చేరాడు. బి.ఎ. సెకండ్ క్లాసులో ప్యాసయ్యాడు. ఈ మధ్యనే ప్రయివేటుగా కూర్చుని ఎం.ఎ. హిస్టరీలో పోస్టుగ్రాడ్యుయేట్ కూడా అయ్యాడు. ఉద్యోగంలో చేరాకనే టైపు లోయర్, హైయ్యర్ కూడా పూర్తిచేశాడు. విధి నిర్వహణలో నిప్పులాంటి మనిషి. కుర్చీకి అంటుకుపోయి పొద్దస్తమానమూ తలెత్తకుండా తన పని తాను చేసుకుపోయే చిత్తశుద్ధిగలవాడు. అందుచేతనే పద్నాలుగేళ్ళ నుంచీ కుర్చీ, టేబులూ మారకుండా ఒకే సీటుకు అంకితమైపోయి పనిచేస్తున్నాడు శివసుబ్రహ్మణ్యం.

శివసుబ్రహ్మణ్యం లంచాలు పుచ్చుకోడు; ఎవరైనా కాఫీ తాగుదాం రమ్మన్నా పోడు; రెండు అరటిపండ్లు ఇచ్చినా నిర్మొహమాటంగా వొద్దంటాడు. ఆఫీసు పని విషయంలో పై అధికారి ఏం చెబితే అది చేస్తాడు. గానుగెద్దులా పని చేయడమే అతని ప్రవృత్తి. ఆఫీసు టైం మించిపోయినా చేతిలో పని కానిదే కుర్చీలోంచి లేవడు. అతను పెళ్ళాంకి తాళికట్టాడా, ఆఫీసు కుర్చీకి తాళికట్టాడా అని తోటి ఉద్యోగులు అప్పుడప్పుడూ ఎగతాళిచేస్తూ వుంటారు. అయినా ఏమీ అనుకోడు.

అతనికంటె ఆరేళ్ళ వెనుక అదే ఆఫీసులో ఎల్డీసీగా చేరాడు సత్యసుందరం. అతను చదివింది కేవలం ఇంటర్మీడియట్. టైపు రాదు; షార్ట్ హ్యాండ్ రాదు. పది పంక్తులు తప్పుల్లేకుండా డ్రాఫ్ట్ వ్రాయలేడు. అర్థగంట సేపు కుర్చీలో కూర్చోలేడు. పై ఆఫీసరు గజిబిజిగా నోట్ ఫైలుమీద రాస్తే, దాన్ని అర్థంచేసుకోలేడు. కరెంట్ ఫైలుకు రిఫరెన్సులు ఫ్లాగ్లు గుచ్చి ఎట్లా అమర్చాలో తెలీదు. అయినప్పటికీ ఎల్డీసీ నుంచి, యు.డి.సి. అయి, డిప్యూటీ స్కూళ్ల ఇన్స్పెక్టరు చేసి, మరో ప్రమోషన్ పొంది అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరయ్యాడు సత్యసుందరం.

అదెట్లా సంభవం?

సత్యసుందరం మంచి మాటకారి. అతనికి బ్రతుకంటే ఏమిటో తెలుసు. జీవితసారమూ తెలుసు. జీవితాన్ని ఛాలెంజీగా తీసుకొంటే దాన్ని ఎదుర్కొంటాడు. జీవితంలో విషాదం ఎదురైతే అధిగమిస్తాడు. జీవితం సమస్యల్లో ఇరుక్కుంటే, ఆ సమస్యల్ని పరిష్కరించుకుంటాడు. జీవితాన్ని ఒక గీతంలా భావిస్తే, ఖులాసాగా పాడుకుంటాడు. జీవితాన్ని ఒక ఆటగా అనుకుంటే, ఆడుకుంటాడు. పై అధికార్లను ఆశ్రయించి తన పబ్బం గడుపుకోవడంలో అందె వేసిన చేయి. అందుచేతనే సత్యసుందరం పదోన్నతిసోపానంలో సునాయాసంగా పైకి పోగలిగాడు. అతని సర్వీసు రికార్డులో అన్నీ పచ్చగీతలే. తన పై అధికారి గుర్రమైనా, గాడిదైనా అత్యంత వినయంతో సేవలు అందించి, మెప్పును పొందుతాడు. తన పై అధికారి నీతిపరుడైనా, అవినీతిపరుడైనా అందుకు అనుకూలంగా నడుచుకొని, 'సెభాష్' అనిపించుకుంటాడు. ఆఫీసు కొలువుకంటె ఆఫీసరు కొలువు ఎక్కువ చేస్తాడు. పై అధికారుల్ని కాకాపట్టడంతోనే ప్రభుత్వోద్యోగంలో పైమెట్లు ఎక్కవచ్చుని ఉద్యోగంలో చేరిన మొదటిరోజునే గ్రహించి 'సార్' అనే మూలపదాన్ని అలవర్చుకున్నాడు.

—అట్లాంటి సత్యసుందరం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరయ్యాక హఠాత్తుగా చిక్కుల్లోపడ్డాడు. ఆఫీసుసొమ్మును గుళ్ళో తీర్థంలాగా సేవిస్తున్నాడనీ, బిల్లు చెల్లింపులకూ, బదిలీలకూ, ఆఫీసు స్టేషనరీ కొనుగోలుకూ, చిల్లరమల్లర పనులకూ పర్సెంటేజీరేట్లు ఫిక్స్‌చేశాడనీ మూడుపేజీల అర్జీని సత్యసుందరం మీద పెట్టి, సంతకాలతో డైరక్టరేట్ ఆఫీసుకు పంపారు. అంతేకాకుండా అతను అక్రమంగా ఆర్జించిన ఆస్తుల్ని ఉదాహరిస్తూ ఆ అర్జీకి ఒక జాబితాను అనుబంధంగా చేర్చారు. దానిపై డైరక్టరేట్ నుంచి ఒక జాయింట్ డైరెక్టర్ను నియమిస్తూ ప్రత్యక్ష విచారణకు శ్రీముఖం వచ్చింది. ఆఫీసులో చాలమంది కలవరపడ్డారు; డి.ఇ.వో.తోసహా. కాని సత్యసుందరం మాత్రం చీమకుట్టినట్టుగా కూడా గతుక్కుమనలేదు.

ఎంక్వయిరీ ఆఫీసరు ఫస్ట్‌క్లాస్ బోగీలోంచి దిగగానే ఒక నల్లటివ్యక్తి అతనికి స్వాగతం చెప్పి, బ్లూ ఎంబాసిడర్ కారులో కూర్చోబెట్టాడు.

"డి.ఇ.వో. జీప్ ఏమైంది?" అన్నాడు ఎంక్వయిరీ ఆఫీసరు.

"నెలరోజుల్నుంచి రిపేరులో వుంది సార్".

టవున్‌కు కిలోమీటరు దూరంలో వున్న ఓ గెస్ట్ హౌస్‌లో ఆ ఆఫీసర్ను ఆ నల్లటివ్యక్తి దింపాడు.

"గవర్నమెంట్ గెస్టుహౌస్ బుక్‌చేయమని చెప్పానే!"

"టవున్లో ఇవాళ ఇద్దరు మంత్రులున్నారు సార్. గెస్టుహౌస్ ఖాళీ లేదు. ఇక్కడ అన్ని సౌకర్యాలూ సునాయసంగా లభిస్తాయి సార్" అన్నాడా నల్లటివ్యక్తి.

ఆ గెస్టుహౌస్ అధునాతన వసుపాయాలతో ఎంతో అందంగా, అనువుగా, అహ్లాదంగా, అయిదునక్షత్రాల హోటల్ సూట్‌లా వుంది. ఎంక్వయిరీ ఆఫీసరు సంతృప్తిపడ్డాడు.

ఆ రాత్రి ఏడున్నరకు బేలంటైన్ స్కాచ్‌బాటిలూ, స్పెన్సర్ సోడాలూ ఎంక్వయిరీ ఆఫీసరు ఎయిర్‌కండిషన్డు గదిలోకి చేరాయి. వేయించిన కాజూతో పాటు కనురెప్పలు అల్లల్లాడించాడు ఎంక్వయిరీ ఆఫీసరు. ఆ నల్లటివ్యక్తే సోడా ఓపెన్‌చేసి డ్రింక్ గ్లాసులో పోసాడు. మల్లెపువ్వులాంటి గ్లాస్కో బంగీతో, పెద్దాపురం సిల్కులాల్చీతో వున్న ఆఫీసరు అరగంటలో అరబాటిల్ ఖాళీచేసి, "స్కాచ్ జెన్యూన్" అన్నాడు మత్తుతో మూతలుపడే కనురెప్పలతో.

"రాయల్ శాల్యూట్‌కోసం ప్రైవేశాను సార్. దొరకలేదు. ఇటీవల టవున్‌కు మంత్రులరాకిడి ఎక్కువైంది." అన్నాడు నల్లటివ్యక్తి.

ఎంక్వయిరీ ఆఫీసరు భోజనానికి కూర్చున్నాడు. టేబుల్‌మీద వెజిటేరియన్, నాన్‌వెజిటేరియన్ వెరసి పద్దెనిమిది పదార్థాలు. అయనకవి ముప్పైఆరు పదార్థాల్లాగా కనబడ్డాయి. "వండర్‌ఫుల్" అంటూ మీగడతో మిక్స్‌చేసిన గడ్డపెరుగును మాత్రం రెండుస్పూనులు గొంతులో వేసుకొని, నిషా నషాళానికి తన్నడంతో బెడ్‌మీద వాలాడు.

అయన బెడ్‌మీద వాలిన మరుక్షణమే ఓ మృదువైన గాజులచేయి, చెంపల్ని సునువుగా నిమిరింది. ఆమె రంభా? ఊర్వశా? తిలోత్తమా? మేనకా? — ఎవరు? అనుకున్నాడు ఎంక్వయిరీ ఆఫీసరు, స్కాచ్‌విస్కీ ప్రేరణతో ఉత్తుంగ తరంగంలా బుస్సుమన్న మగతనంతో.

ఆ గది తలుపుల్ని బయటనుంచి మూశాడు ఆ నల్లటివ్యక్తి.

మరునాడు సత్యసుందరంమీద ప్రత్యక్ష విచారణ జరిగింది. సాక్షులు చెప్పడానికొచ్చినవాళ్ళు తడబడ్డారు. ఆ నల్లటివ్యక్తి ఆఫీసరుగారి దగ్గరే వున్నాడు. ఎంక్వయిరీ ముగించుకొని ఆ మధ్యాహ్నమే రైలెక్కాడు ఆఫీసరు.

"నేను సెలవు తీసుకుంటాను సార్" అన్నాడు ఆ నల్లటివ్యక్తి.

"అన్నట్టు అడగడం మర్చాను. నువ్వెవరివోయ్?" అన్నాడు ఎంక్వయిరీ ఆఫీసరు.

"నేను మున్సిపల్ కాంట్రాక్టర్నండీ, న్యాయానా సత్యసుందరంగారి బావమర్దిని" అన్నాడా నల్లటివ్యక్తి.

ఎంక్వయిరీ ఆఫీసరు కనురెప్పలు టపటపా కొట్టుకున్నాయి — కొన్ని క్షణాలపాటు.

సత్యసుందరం సర్వీసురికార్డు జోలికి ప్రకలం పోలేదు. అతనిమీద ఆరోపణలన్నీ నిరాధారమైనవని ఎంక్వయిరీ రిపోర్టులో తేలింది.

*ప్రభుత్వోద్యోగి పనిచేయనక్కర్లేదు;*

*పైరవీలో ప్రావీణ్యం సంపాయిస్తే చాలు.*

